
సాక్షి
కాకినాడ

ఆదివారం । 9 । జూలై । 2023



రత్నగిరికి పోటెత్తిన భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని శనివారం సుమారు 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది.




డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 2,390, మధ్య డెల్టాకు 1,710, పశ్చిమ డెల్టాకు 4,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
37.0°/25.5°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	37.0	26.0
కాకినాడ	35.0	25.5
అమలాపురం	36.0	27.0

మహానేతా.. మనసా స్మరామి



- జిల్లాలో పండుగలా మహానేత జయంతి
- సేవా కార్యక్రమాలతో వైఎస్సార్‌కు నివాళులు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు..అభిమానులు

సాక్షిప్రతినిధి,కాకినాడ: జిల్లావ్యాప్తంగా మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు శనివారం పండుగ వాతావరణంలో జరిగాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు..శ్రేణులతో పాటు అభిమానులు, స్వచ్ఛంద సంస్థలు, పార్టీలకతీతంగా సేవా కార్యక్రమాలతో ఆయనకు ఘన నివాళులర్పించారు. పలుచోట్ల కేకులు కట్‌చేసి, మిఠాయిలు పంచారు. వృద్ధులకు, నిరుపేదలకు చీరలు పంపిణీ చేశారు. వివిధ సంక్షేమ పథకాల ఫలాలు అందుకున్న లబ్ధిదారులు స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు.

- తునిలో వైఎస్ విగ్రహానికి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. తుని రూరల్ మండలం తాళ్లూరులో రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. నిరుపేదలు, మధ్య తరగతి వర్గాలతో పాటు అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించి వారి హృదయాల్లో వైఎస్ చెరగని ముద్రవేసుకున్నారని ఈ సందర్భంగా రాజా నివాళులర్పించారు. ఆయన వారసత్వాన్ని అందిపుచ్చుకుని తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి అదే ఒరవడిని కొనసాగిస్తున్నారన్నారు.



తునిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి రాజా

- కాకినాడ మణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాకలపూడిలో జరిగిన జయంతి వేడుకల్లో ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పాల్గొని కేక్ కట్ చేశారు. వృద్ధుల ఆశ్రయమంలో అన్నదానంతోపాటు రోగులకు పండ్లు, బ్రెడ్‌లు అందచేశారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన రైతు దినోత్సవంలో ఎంపీ, ఎమ్మెల్యేలు వైఎస్ఆర్ పశునష్టపరిహారం చెక్కులను రైతులకు పంపిణీ చేశారు.



మృతి చెందిన వలంటీర్ కుటుంబానికి ద్వారంపూడి ఆర్థిక సాయం

- కాకినాడ కోకిల సెంటర్, బాలాజీచెరువు సెంటర్‌లలో రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహాలకు ఎంపీ వంగా గీత, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డైరీఫారం సెంటర్‌లో వైఎస్ఆర్ జయంతి, ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా సొంత నిధులు రూ.15లక్షలతో స్కూలు విద్యార్థులకు రెండు బస్సులను సమకూర్చారు. కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా, ఎంపీ గీత, కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్‌లకు ఈ బస్సు తాళాలను ద్వారంపూడి అప్పగించారు. బులుసు సాంబమూర్తి పాఠశాలలో పార్టీ, నాయకులు, కార్యకర్తలు, అన్న, వస్త్రదానం చేశారు. మృతి చెందిన వలంటీర్ కుటుంబంలోని ఇద్దరు ఆడపిల్లలకు రూ.లక్ష అందజేశారు.



పండూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న కన్నబాబు

- పిఠాపురం పాతబస్టాండ్ సెంటర్‌లో వైఎస్ విగ్రహానికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు.
- ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం సెంటర్‌లో వైఎస్ విగ్రహానికి ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అగ్రిల్యాబ్‌ను ప్రారంభించారు.
- జగ్గంపేట ఆర్టీసీబస్టాండ్ సెంటర్‌లో రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు.
- పెద్దాపురం మున్సిపల్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, పెద్దాపురం కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు పూలమాలలు వేశారు. నివాళులర్పించారు.ప్రభుత్వ ఆస్పత్రి, సిరి మానసిక వికలాంగుల ఆశ్రమంలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

రైతు రాజు కావాలన్నదే లక్ష్యం

- అన్నదాతల సంక్షేమానికి విప్లవాత్మక పథకాలు
- కాకినాడ ఎంపీ వంగా గీత

కాకినాడ సిటీ: రైతే రాజు కావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు విప్లవాత్మక పథకాలను అమలు చేస్తున్నారని ఎంపీ వంగా గీత అన్నారు. అనంతపురం జిల్లాలో డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమాను సీఎం జగన్ శనివారం ప్రారంభించిన సందర్భంగా జిల్లా స్థాయి కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా, వ్యవసాయాధికారి ఎస్.విజయకుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎల్.ప్రసాద్, వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు, అధికారులు హాజరయ్యారు. సీఎం కార్యక్రమం ముగిశాక డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకానికి సంబంధించి రూ.12 కోట్ల మెగా నమూనా చెక్కును రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడుతూ రైతులు ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేకుండానే ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తుందన్నారు. వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యమిచ్చి, రైతుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పని చేస్తుందని వివరించారు.



రైతులకు మెగా నమూనా చెక్కును అందజేస్తున్న ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలు, కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేస్తుందని కలెక్టర్ కృతికా శుక్లా వివరించారు. ఖరీఫ్–2022 సీజన్‌కు సంబంధించి డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా జిల్లాలో 16,811 మంది రైతులకు రూ.12 కోట్ల మేర లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రతి పథకానికి లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి ఆర్బీకేల్లో సోషల్ ఆడిట్ కోసం జాబితాలను ప్రదర్శిస్తున్నట్లు వివరించారు. జిల్లాకు ఆరు సమీకృత వ్యవసాయ ప్రయోగశాలలు మంజూరయ్యాయని, జగ్గంపేట ల్యాబ్ ప్రస్తుతం పని చేస్తోందన్నారు. రూ.కోటితో ఏర్పాటు చేసిన శంఖవరం ల్యాబ్ కూడా రైతులకు సేవలందించేందుకు సిద్ధమైందన్నారు.

1300 మంది ఉద్యోగాలకు ఎంపిక



నియామక పత్రం అందజేస్తున్న ప్రసాదరాజు, ఎ.కరుణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రతిభ ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. వర్సిటీ అవరణలో చలమలశెట్టి సునీల్ చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాబ్‌మేళా శనివారం ముగిసింది. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ 70 కంపెనీలకు సంబంధించి జాబ్‌మేళా నిర్వహించగా 1300 మంది ఉద్యోగాలు సాధించారన్నారు. కార్యక్రమంలో డీపీపీ మురళీకృష్ణ ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, టీపీఓ ఎ.కరుణ, స్పోర్ట్స్ కౌన్సెల్ కార్యదర్శి శ్యామ్‌కుమార్,ట్రస్ట్ చైర్మన్ రెడ్డం దుర్గాప్రసాద్, డీపీపీ మురళీకృష్ణ, డైరెక్టర్ కృష్ణమోహన్, ముత్యాల సతీష్,ఎండీ హబీబ్ బాషా,శాంతిప్రియ,మీసాల మధు,ట్రస్ట్ సభ్యులు,వాలంటీర్లు పాల్గొన్నారు.

పారదర్శక పాలనకు నిలువుటద్దం ఈ ప్రభుత్వం

రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: ప్రజల నుంచి ఒక్క రూపాయి కూడా లంచం తీసుకోకుండా పారదర్శకంగా పని చేస్తున్న ప్రభుత్వం తమదని రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని మండలం తాళ్లూరులో రూ.33.34 లక్షలతో నిర్మించిన ఉర్దూ పాఠశాలలో అదనపు గదులు, రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలను శనివారం మంత్రి ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. గ్రామస్తులు ఏర్పాటు చేసిన నిలువెత్తు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ఇవ్వాలన్నా, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నా ప్రజల నుంచి లంచాలు తీసుకుని పనిచేసేవారు అన్నారు. తమ ప్రభుత్వంలో అన్నివర్గాలకూ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధిని గాలికి వదిలేసి ప్రజల ఆదాయాన్ని ఎల్లో మీడియాకు, యనమల రామకృష్ణుడి సోదరులకు దోచిపెట్టారన్నారు. నియోజకవర్గ ప్రజలు ఓట్లు వేయరని గ్రహించిన యనమల తన కుమార్తె ముఖాన్ని చూపించి గెలిపొందాలని ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి మరోసారి మోసపోవద్దన్నారు. 2024 ఎన్నికల్లో గెలిచేది వైఎస్సార్ సీపీనే అన్నారు. సంక్షేమ పథకాలు అందాలన్నా, అభివృద్ధి జరగాలన్నా నిబద్ధత గల ముఖ్యమంత్రి కావాలని, అది సీఎం జగన్‌కే సాధ్యమన్నారు. అప్పులు చేస్తున్నట్టు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయని, దేశంలో సగటు ఆర్థిక వ్యవస్థలో రాష్ట్రం ముందుందన్నారు. ఆదాయంలో ప్రథమస్థానంలో ఉన్నామన్నారు. తాళ్లూరు గ్రామస్తులు తుని రాకపోకలకు దశాబ్దాలుగా అష్టకష్టాలు పడ్డారని, రూ.5కోట్లతో రైల్వే అండర్‌పాస్ వేయడంతో వారి కష్టాలు తీరాయన్నారు. పెరిక కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం గంగాభవానీ, మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీ బొప్పన రాము, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, నాయకులు తమరాన శ్రీనివాసరావు, గండి రాజులనాయుడు, షేక్ సుభాని పాల్గొన్నారు.



తాళ్లూరులో గ్రామ సచివాలయాన్ని ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

క్లుప్తంగా

డబుల్ ధమాకా..



కవల దూడలకు జన్మనిచ్చిన ఆవు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీ గౌతమ మహర్షి గో సంరక్షణ సమితి గోశాలలో శనివారం ఓ ఆవుకు కవల దూడలు పుట్టాయి. ఈ గోశాలలో 15 ఏళ్లుగా వందకు పైగా గోవులు ఆశ్రయం పొందుతున్నాయి. ఇన్నేళ్లలో ఇక్కడ ఆవుకు కవల దూడలు పుట్టడం ఇదే తొలి సారని గోశాల వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణారావు ఆనందంగా చెప్పారు. ఆవు, దూడలు ఆరోగ్యంగా ఉన్నాయని పశు సంవర్ధక శాఖ అమలాపురం సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయరెడ్డి చెప్పారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



దైవానందం మృతదేహం

ఏలేశ్వరం: మండలంలోని కొత్త యర్రవరంలో విద్యుత్ షాక్ తగిలి శనివారం ఒకరు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కొత్త యర్రవరం గ్రామంలో జీడిపిక్కల ఫ్యాక్టరీ ఏర్పాటుకు షెడ్ నిర్మిస్తున్నారు. ఈ పనులకు కిర్లంపూడి మండలం వీరవరం గ్రామానికి చెందిన కొప్పన దైవానందం (57), పెనమ రెడ్డి వీరగణేశ్వరరావు, వెలుగుల అప్పలరాజు వచ్చారు. షెడ్ పై భాగంలో రేకులు వేసేందుకు ఈ ముగ్గురూ నిచ్చెన పట్టుకోగా పైన ఉన్న విద్యుత్ వైర్లు తగిలాయి. దీంతో ముగ్గురూ విద్యుత్ షాక్‌కు గురయ్యారు. వీరిలో దైవానందం మృతి చెందగా మిగిలిన ఇద్దరిలో అప్పలరాజు పరిస్థితి విషమంగా ఉంది. వీరగణేశ్వరరావుకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని ఏలేశ్వరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఎస్సై జి.సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆస్పత్రి వద్ద ప్రధాన రహదారిపై మృతుడి బంధువులు రాస్తారోకో చేశారు.



కొవ్వూరు యానాద కాలనీలో గోరింటాకు కోస్తున్న మహిళలు

విరిసిన ఎర్ర మందారంలా..

- ఆషాఢంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం సంప్రదాయం
- ఇన్‌ఫెక్షన్లు దరి చేరవని నమ్మకం
- ఆకట్టుకుంటున్న రకరకాల డిజైన్లు

కొవ్వూరు: ఆషాఢ మాసం వచ్చిందంటే చాలు.. ఆరేళ్ల బాలికల నుంచి అరవయ్యేళ్ల ముత్తయిదువల వరకూ ఒకటే సందడి.. గోరింటాకు కోసుకునో, కొనుక్కునో తెచ్చుకోవడం.. దానిని ముద్దగా నూరడం.. చేతి, కాలి వేళ్లకు, పాదాలపై రకరకాల డిజైన్లలో పెట్టుకోవడం.. అరచేతిలో, అరికాలిలో చందమామలానో.. మరేదైనా డిజైన్‌తోనో అద్దుకోవడం.. కొంతసేపు ఆరిన తరువాత దానిని తొలగించి.. శుభ్రంగా కడుక్కుని ఎంత ఎర్రగా పండిందో చూసుకుని మురిసిపోవడం.. వారి మురిపాలు చూసి అన్నదమ్ములు, నాన్న, బాబాయ్‌లు, మామయ్యలు.. ఇలా పురుషపుంగవులంతా ఆనందించడం .. ఇదంతా ప్రతి ఇంటా కనిపించే గొప్ప ముచ్చట. గోరింటాకు పేరిట దర్శకరత్న దాసరి నారాయణ రావు ఏకంగా ఓ సినిమాయే తీశారు. ఆ సినిమాకు దేవులపల్లి కృష్ణశాస్త్రి ఏకంగా 'గోరింటా పూసింది కొమ్మా లేకుండా.. మురిపాల అరచేత మొగ్గా తొడిగింది' అంటూ ఓ పాటే రాసేశారు.

సౌభాగ్య చిహ్నంగా..

గోరింటాకును స్త్రీలు సౌభాగ్యానికి చిహ్నంగా భావిస్తారు. గోరింటాకు అంటే 'గోటికి అంటు ఆకు' అని అర్థమట. దీనిని 'న కరంజనీ' అని కూడా అంటారు. అంటే గోళ్లను పండించేది అని అర్థం. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం ఎంతో మంచిదని పెద్దలు చెబుతారు. గోరింటాకు ఎంత ఎర్రగా పండితే అంత మంచి భర్త వస్తాడని, దాంపత్యం అంత అన్యోన్యంగా ఉంటుందని చాలామంది విశ్వసిస్తారు. కొత్త పెళ్లి కూతుళ్లు ఈ మాసంలో కచ్చితంగా గోరింటాకు పెట్టుకోవాలని అంటారు.





గౌరీ ఇంటి ఆకే..

గోరింటాకు ఆవిర్భావం వెనుక చిత్రమైన కథ చెబుతారు. చిన్నతనంలో గౌరీదేవి రజస్వల అయి, ఆమె రక్తపు బొట్టు నేలకు తాకడంతో ఈ మొక్క ఉద్భవించిందంటారు. తండ్రి పర్వతరాజు సతీసమేతంగా వచ్చి చూస్తే ఆ చెట్టు పెద్దదై ఉంటుంది. గౌరీదేవి ఆ చెట్టు ఆకులు కోస్తే చేతులు ఎర్రగా పండిపోతాయి. బిడ్డ చేతులు కందిపోయాయని పర్వతరాజు భావించగా, తన చేతులకేమీ కాలేదని, ఎర్రబడి, కొత్త అలంకారంతో మరింత అందంగా ఉన్నాయని ఆమె చెబుతుంది. దీంతో సంతోషించిన పర్వతరాజు ఇకపై ఈ మొక్క ఆకు స్త్రీ సౌభాగ్య చిహ్నంగా లోకంలో ప్రసిద్ధి చెందుతుందని చెప్పాడట. అలా గౌరీదేవి ఇంట ఉద్భవించిన 'గౌరీ ఇంటి ఆకు'.. క్రమంగా గోరింటాకుగా మారిందంటారు. రజస్వల సమయాన ఉద్భవించిన ఈ చెట్టు స్త్రీల గర్భాశయ సమస్యలను తొలగిస్తుందని చెబుతారు.



గోరింటాకు పెట్టుకున్న చేతులు

గోరింటాకే శ్రేయస్కరం



గోరింటాకు పెట్టుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. మార్కెట్‌లోకి వచ్చే కోన్‌లలో గోరింటాకుతో పాటు వివిధ రసాయనాలుంటాయి. సహజసిద్ధంగా లభ్యమయ్యే గోరింటాకు వినియోగించడమే శ్రేయస్కరం.

– కొండపల్లి నాగేశ్వరి, గృహిణి, కొవ్వూరు

ఆరోగ్య రీత్యా మేలు



ఆషాఢంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం పూర్వం నుంచీ వస్తున్న సంప్రదాయం. ఈ మాసంలోనే కాలం ఉత్తరాయణం నుంచి దక్షిణాయానంలోకి మారుతుంది. వర్షాలు ప్రారంభమయ్యే సమయం కావడంతో ఔషధ గుణాలున్న గోరింటాకు ఆరోగ్య రీత్యా కూడా మేలు చేస్తుందని పెద్దలు చెబుతారు.

– యనమండ్ర సూర్యనారాయణమూర్తి, పండితుడు, కొవ్వూరు

ఎన్నో ఉపయోగాలు

- గోరింటాకు ఏడాది పొడవునా పెట్టుకోవచ్చు. అలా చేయడం లేదని కనీసం ఆషాఢ మాసంలోనైనా తప్పనిసరిగా పెట్టుకోవాలని పెద్దలు ప్రోత్సహిస్తున్నారు. ఆషాఢంతోనే వేసవి ముగిసి.. వర్ష రుతువు ఆరంభమవుతుంది. ఈ సమయంలో తరచూ వానల్లో తడుస్తూండటం, బురదలో తిరగడం వలన వివిధ రకాల ఇన్ఫెక్షన్లు, గోళ్లల్లో మట్టి ఉండిపోవడం, ఒరుపులు, పాచిపోవడం, పిప్పిగోళ్లు, చర్మవ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వీటికి అడ్డుకట్ట వేయడానికి గోరింటాకు ఉపకరిస్తుందని చెబుతారు. అందుకే పెద్దలు అరికాళ్లకు, పాదాలకు, చేతులకు, గోళ్లకు పూర్తి స్థాయిలో గోరింటాకు పెట్టుకునే వారు.
- శరీరంలోని వేడిని తొలగిస్తుంది.
- అరచేతిలో స్త్రీ గర్భాశయానికి సంబంధించిన నాడులుంటాయని, చేతికి గోరింటాకు పెట్టుకోవడం వలన అతి ఉష్ణం తగ్గి, మేలు జరుగుతుందని చెబుతారు.
- ఆయుర్వేదం ప్రకారం గోరింటాకులోని రసాయనాలు పుండ్లను మాన్పుతాయి.
- గోరింటాకు ప్రకృతి సహజసిద్ధంగా ప్రసాదించిన రంగు. తల నెరిసిన వారు రసాయనాలు కలిపిన హెయిర్ డైలు వాడటం వలన రకరకాల చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. దీనికి బదులు గోరింటాకు పెట్టుకోవడం ఎంతో మంచిదని చెబుతారు.
- కాళ్లు పగలడం సమస్య ఉన్న వారు గోరింటాకు పెట్టుకుంటే మంచి ఫలితాలుంటాయి.

మెహందీ రూపంలో కొత్త పుంతలు



ఒకప్పుడు ఇంట్లో ఏ శుభ కార్యం జరిగినా మహిళలు వీలైనంత వరకూ గోరింటాకు తప్పనిసరిగా పెట్టుకునే వారు. గోరింటాకు దొరకని వారికి ఒకింత అసంతృప్తి మిగిలేది. ఇప్పుడా బాధ లేకుండా.. చాలా కాలం నుంచి మెహందీ అందుబాటులోకి వచ్చింది. ఏ ఇంట్లో ఫంక్షన్లు జరిగినా మెహందీకి ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా ఇటీవల కొన్నాళ్లుగా పెళ్లిళ్లు, పండగలు, ఇతర ఫంక్షన్లలో ఆడవాళ్లంతా సమూహంగా చేరి గోరింటాకు (మెహందీ) పెట్టుకోవడాన్ని ప్రత్యేక వేడుకగా నిర్వహిస్తున్నారు. దీనిని స్టేటస్ సింబల్‌గా కూడా భావిస్తున్నారు. ప్రత్యేకంగా శిక్షణ పొందిన మహిళలు వివిధ రకాల ఆకర్షణీయమైన డిజైన్లలో కోన్‌లతో మెహందీ పెడుతున్నారు. పెళ్లికూతురి రెండు చేతులకూ మెహందీ పెట్టడానికి రూ.1,500 నుంచి రూ.2 వేల వరకూ తీసుకుంటున్నారు. డిజైన్‌ను బట్టి ధర ఉంటుంది. ఒక్కో వేడుకకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ వెచ్చిస్తున్నారంటే మెహందీకి ఎంత క్రేజ్ ఉందో అర్థం చేసుకోవచ్చు.



వివిధ రకాల మెహందీ కోన్‌లు

మానసిక వైద్య విభాగానికి అధిక ప్రాధాన్యం

- సైకియాట్రిక్ విభాగంలో పీజీ సీట్ల పెంపు
- త్వరలో క్లినికల్ సైకాలజీ కోర్సులు
- వైద్య విద్య డైరెక్టర్ డాక్టర్ నరసింహం



సదస్సును ప్రారంభిస్తున్న వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వైద్య రంగానికి ప్రభుత్వాలు పెద్ద పీట వేస్తున్నాయని, మానసిక వైద్య విభాగానికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నాయని, ఇందులో భాగంగానే సైకియాట్రిక్ విభాగంలో పీజీ సీట్లు పెంచారని రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్ డాక్టర్ డీవీఎస్ఎల్ నరసింహం అన్నారు. మానస హాస్పిటల్ ఆధ్వర్యాన రెండు రోజుల పాటు నిర్వహించే మానసిక వైద్య నిపుణుల రాష్ట్ర స్థాయి నాలుగో సదస్సు స్థానిక మంజీర ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ నరసింహం మాట్లాడుతూ, త్వరలోనే క్లినికల్ సైకాలజీ కోర్సులు ప్రారంభిస్తామని చెప్పారు. టీటీడీ సహకారంతో తిరుపతిలో దీర్ఘకాలిక మానసిక రోగుల పునరావాస కేంద్రం కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వీటిని జిల్లా స్థాయిల్లో కూడా ఏర్పాటు చేస్తామన్నారు. మానసిక వైద్యానికి సంబంధించి ఇప్పటికే 25 డీ ఎడిక్షన్ సెంటర్లు పని చేస్తున్నాయని చెప్పారు. మానసిక వైద్య విభాగానికి న్యాయ, సామాజిక, విలువల పరంగా వస్తున్న సమస్యల పరిష్కారానికి స్టేట్ మెంటల్ హెల్త్ అథారిటీ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. జిల్లా స్థాయిల్లో ప్రాధికార సంస్థల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటున్నామని తెలిపారు. అనంతరం ఎడిటర్స్ సావనీర్‌ను డాక్టర్ నరసింహం ఆవిష్కరించారు. సదస్సును ప్రారంభించిన వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి మాట్లాడుతూ, వర్సిటీ పరిధిలో 400 కాలేజీలు, 3 వేల మంది వైద్య విద్యార్థులు ఉన్నారని తెలిపారు. సైకియాట్రిక్ విభాగంలో 750 పీజీ సీట్లు పెంచడమే కాకుండా మానసిక వైద్య విభాగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ఇండియన్ మానసిక వైద్య నిపుణుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ మాట్లాడుతూ, మానసిక వైద్య విభాగాన్ని ప్రజలకు మరింత చేరువ చేశామని తెలిపారు. డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ, దీర్ఘకాలిక మానసిక రోగుల విషయంలో పునరావాస కేంద్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఈ సదస్సుకు 450 మంది ప్రతినిధులు హాజరయ్యారని ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కర్రి రామారెడ్డి చెప్పారు. సదస్సు నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కర్రి మానస తదితరులు పాల్గొన్నారు.

కొడుకును చూడటానికి వచ్చి.. తల్లి మృత్యువాత



లోవతల్లి మృతదేహం

తుని: పెద్ద కుమారుడితో కలిసి చిన్న కొడుకును చూడటానికి వచ్చిన తల్లిని ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. తుని పట్టణ ఎస్సై మురళీమోహన్ కథనం ప్రకారం.. శంఖవరం మండలం మండపం గ్రామానికి చెందిన ఉంద్రు లోవతల్లి (35) చిన్న కుమారుడు తుని మండలం లోవకొత్తూరులోని బాలయోగి గురుకుల పాఠశాలలో చదువుతున్నాడు. అతడిని చూసేందుకు ఆమె తన పెద్ద కుమారుడు పవన్‌తో కలిసి మోటార్ సైకిల్‌పై శనివారం తుని వచ్చారు. పట్టణంలో సామాన్లు కొనుగోలు చేసి వెళ్తుండగా.. వారి బైక్‌ను తుని నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో వెనుక కూర్చున్న లోవతల్లి బస్సు కింద పడిపోయింది. తీవ్ర గాయాలైన ఆమెను తుని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తూండగా మార్గం మధ్యలోనే మృతి చెందింది. పవన్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న లోవతల్లి భర్త నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రమాదానికి కారణమైన బస్సును సీజ్ చేసి, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై మురళీమోహన్ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని: స్థానిక ప్రభుత్వ రైల్వే పోలీస్ (జీఆర్‌పీ) స్టేషన్ పరిధిలో అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలం పద్మనాభరాజుపేట వద్ద రైలు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. జీఆర్‌పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ కథనం ప్రకారం.. పద్మనాభరాజుపేటకు చెందిన కాళిగట్ల నూకరాజు (58) శనివారం నర్సీపట్నం రోడ్డు – రేగుపాలెం స్టేషన్ల మధ్య ఉన్న పొలానికి వెళ్లాడు. పొలంలో ఎరువు జల్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో పట్టాలు దాటుతూండగా తుని నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న గుర్తు తెలియని రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో నూకరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించామని ఎస్సై మారూఫ్ తెలిపారు.